

మాట ఇచ్చాం.. నిలబెట్టుకున్నాం



ప్రసంగిస్తున్న సీఎం చంద్రబాబు

"నేను మీవద్దకు వచ్చింది..
సమస్యలు తెలుసుకోవడానికి. మీకు రెట్టింపు ఆదాయం లభించేలా చేయాలన్నదే నాతపన"
" అందరికీ ఇళ్లు మంజూరు చేయిస్తా. వలలను కూడా 80 శాతం రాయితీపై ఇప్పిస్తా. హార్బర్ నిర్మాణం పూర్తిచేయిస్తా. జూన్ నుంచి అమ్మకు వందనం వర్తింపజేస్తాం"
" మీరందరికీ ఆదాయం పెంచేలా చర్యలు తీసుకుంటాను. టెక్నాలజీ ఉపయోగించి.. వంద కిలోలు చేపలు పట్టేవారికి 200 కిలోలు పట్టుకునేలా చేస్తాం. మరోమారు ఇక్కడికి వస్తాను"

- బుడగట్లపాలెం వద్ద మత్స్యకారులతో సీఎం చంద్రబాబు

- వేట నిషేధ సమయంలో రూ.20 వేల సాయం విడుదల
- 1,29,178 మత్స్యకార కుటుంబాలకు రూ.259 కోట్ల లబ్ధి
- బుడగట్లపాలెంలో 'మత్స్యకారుల సేవలో' ప్రారంభం
- బటన్ నొక్కడం కాదు.. ప్రజా సంక్షేమమే ధ్యేయం
- ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు



బుడగట్లపాలెంలో శ్రీకొత్తమ్మ తల్లిని దర్శించుకుంటున్న సీఎం చంద్రబాబు

శ్రీకాకుళం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): 'కూటమి ప్రభుత్వ పాలనలో మత్స్యకారుల దశ మారింది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మాట నిలబెట్టుకున్నాం. వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు ఆర్థికసాయం రెట్టింపు చేశాం. దీని వల్ల రాష్ట్రంలో 1,29,178 మంది మత్స్యకార కుటుంబాలకు రూ.259 కోట్ల మేర లబ్ధి చేకూరింద'ని సీఎం నారా చంద్రబాబునాయుడు అన్నారు. గత పాలకుల మాదిరి బటన్ నొక్కకుండా.. ప్రజల మధ్యకు వచ్చి సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరిస్తానని వెల్లడించారు. ప్రజా సంక్షేమమే తన ధ్యేయమని స్పష్టం చేశారు. శనివారం ఎచ్చెర్ల నియోజకవర్గం బుడగట్లపాలెంలో 'మత్స్యకార సేవలో' పథకాన్ని సీఎం చంద్రబాబు ప్రారంభించారు. మత్స్యకారులు తూరాడ అప్పన్న, అలుపల్లి తవితాయి కుటుంబాలకు చెరో రూ.20 వేల చొప్పున ఆర్థిక సాయాన్ని సీఎం అందజేశారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. 'మత్స్యకారుల కష్టాలు నాకు తెలుసు. ప్రాణాలను పణంగా పెట్టి సముద్రంలో వేటకు వెళ్లడం.. వారు తిరిగి వచ్చే వరకూ ఆడబిడ్డలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ఎదురుచూడటం నేను స్వయంగా చూశాను. కొందరు వ్యాపారులు బోట్లను ఇచ్చి.. మత్స్యకారుల ఆదాయం వాళ్లే కొట్టేస్తున్నారు. మీ కష్టాలు తీర్చేందుకు నేనున్నాను. మత్స్యకారులు ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటారు. మత్స్యకార గ్రామాలు టీడీపీకి అండగా నిలబడ్డాయి. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వేట

(మిగతా 6వ పేజీలో..)



వలలు పరిశీలిస్తున్న సీఎం



మత్స్యకారులకు 'మత్స్యకారుల సేవలో' పథకం చెక్కును అందజేస్తున్న సీఎం చంద్రబాబు. చిత్రంలో కేంద్ర రాష్ట్ర మంత్రులు రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నాయుడు, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



కార్యకర్తల సమీక్షలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబునాయుడు



సభలో విజయకేతనం చూపిస్తూ.. మత్స్యకారుల సందడి



బుడగట్లపాలెం తీరంలో ఎండబెట్టిన చేపలను పరిశీలించి మత్స్యకారులతో మాట్లాడుతూ..

ప్రభుత్వ పాలసీలతో పైకొచ్చినవారు పేదలకు చేయూతనివ్వాలి

- సీఎం చంద్రబాబు నాయుడు

శ్రీకాకుళం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాలసీలతో ఆర్థికంగా పైకొచ్చినవారు సమాజంలో పేదలు అభివృద్ధి చెందేలా వారికి చేయూతనివ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పిలుపునిచ్చారు. శనివారం ఎచ్చెర్ల మండలం బుడగట్లపాలెంలో 'మత్స్యకారుల సేవలో' పథకాన్ని సీఎం ప్రారంభించారు. అనంతరం ప్రజావేదిక సభలో జీరో ప్రావర్టీ-పీ4 కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడారు. 'రాష్ట్రంలో పేదరికాన్ని సమూలంగా నిర్మూలించాలి. పేదలకు ప్రభుత్వ పథకాలు అందివ్వడమే కాకుండా మార్గదర్శుల ద్వారా సాయం అందించి అన్ని విధాలా పైకి తీసుకువచ్చే కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం. మార్గదర్శులు దత్తత తీసుకున్న కుటుంబాలకు ఏమి చేస్తున్నారో కూడా సమీక్ష చేస్తాం. 2029 నాటికి రాష్ట్రంలో పేదరికం లేకుండా చేయాలన్నదే నా లక్ష్యం. అన్ని విధాలా ఆర్థికంగా పైకొచ్చినవారు పేద కుటుంబాలను ఆదుకుంటే సమాజంలో అసమానతలు ఉండవు' అని సీఎం అన్నారు. అనంతరం మార్గదర్శకులను సన్మానించారు.

బంగారు కుటుంబానికి ఎంపికైన వారు మాట్లాడుతూ..

- **అలుపు లచ్చమ్మ:** నా భర్త ఉపాధి కోసం గుజరాత్ రాష్ట్రం వీరావళ్ వెళ్లారు. నేను ఇంటి వద్దనే ఉంటూ పిల్లలను చూసు కుంటాను. మాది పేద కుటుంబం. నెలకు సుమారు రూ.12 నుంచి రూ. 15వేలు మాత్రమే వస్తాది.
- **సూరాడ అప్పన్న:** మా అమ్మానాన్న లేరు. మా అక్కకు పదిహేనేళ్ల కిందట పెళ్లయింది. కానీ రెండేళ్లకే మానసిక సమస్యను ఎదుర్కోవడం వల్ల ఆమెను భర్త వదిలేశారు. ప్రస్తుతం మా అక్క, ఆమె ఇద్దరి పిల్లలూ మా వద్దనే ఉంటున్నారు. నా భార్య బీఎస్సీ కంప్యూటర్స్ చేసింది. నేను, నా తమ్ముడు వేటకు వెళ్లి మా కుటుంబాన్ని పోషించుకుంటున్నాం. మొత్తం ఎనిమిది మంది కలిసి ఒకే ఇంట్లో ఉంటున్నాం. మా అక్కకు పింఛన్ మంజూరు చేయించండి.
- **సీఎం:** మీ సోదరికి వెంటనే పింఛన్ అందిస్తాం. ఇల్లు కూడా నిర్మించి ఇస్తాం. ఇక్కడే కలెక్టర్‌కు ఆదేశిస్తున్నా. నీ భార్యకు 'మార్గదర్శకులు' ఉద్యోగం ఇవ్వాలని.. ఎలా ఆదుకోవాలో ఏమి చేస్తున్నారో ఇక్కడే చెప్పాలి.

మార్గదర్శిలు మాట్లాడుతూ...

- **బుడుమూరు శ్రీరామమూర్తి:** నేను పాలిటెక్నిక్ కళాశాలలో ప్రిన్సిపాల్‌గా పని చేసి రిటైర్డ్ అయ్యాను. ఈ ప్రాంతంలో డిగ్రీ, పీజీ, డిప్లమో, అగ్రికల్చర్, వెటర్నరీ కోర్సులతో కాలేజీ పెట్టాం. రాష్ట్ర ప్రగతిలో ప్రజల భాగస్వామ్యం పెరిగితే మరింత అభివృద్ధి చెందుతుందని సీఎం చంద్రబాబు ఆలోచన. నేను 25 కుటుంబాలను దత్తత తీసుకుంటాను. సూరాడ అప్పన్న ఇంట్లో కంప్యూటర్ ఏర్పాటు చేస్తా. ఆయన భార్యకు కంప్యూటర్‌పై నైపుణ్యం పెంచి మా వ్యవసాయ కళాశాలలో ఆపరేటర్ ప్రోగ్రామర్‌గా అవకాశం కల్పిస్తాం. వారి పిల్లలను మా కాలేజీలో ఉచితంగా చదివిస్తాం.
- **పి.రాజేష్ బాబు:** నేను కూడా సామాన్య రైతు కుటుంబం నుంచి వచ్చాను. 1995-2004 మధ్య సీఎం చంద్రబాబు ఐటీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమం చేపట్టారు. మేము అబ్రాడ్‌లో కంపెనీ పెట్టాం. 2018లో పైడిభీమవరంలో హెల్త్ కేర్ ఇండస్ట్రీ పెట్టాం. కొవిడ్ సమయంలో మా పరిశ్రమ ద్వారా ఆక్సిజన్ అందించాం. చంద్రబాబుకు మేము రుణపడి ఉన్నాం. మా పరిశ్రమ తరఫున అలుపు లచ్చమ్మ కుటుంబానికి సాయం అందించడంతోపాటు 20 కుటుంబాలను దత్తత తీసుకుంటాం. మత్స్యకారులకు టూల్ కిట్స్, బోట్స్, వారి పిల్లలకు చదువుతో పాటు స్కాలర్‌షిప్స్ అందిస్తాం.

కోస్టల్ కారిడార్‌తో ఎంతో అభివృద్ధి
- కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

27 వేల మందికి అదనంగా 'మత్స్యకార భరోసా'
- మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

కూటమి ప్రభుత్వంతోనే మత్స్యకారుల అభ్యున్నతి
- మంత్రి కొల్లు రవీంద్ర

డ్వాక్రా సంఘాలతో పేదరిక నిర్మూలన
- జిల్లా ఇన్‌చార్జి మంత్రి కె.శ్రీనివాస్

6లో

మా మంచి పాఠశాల

- సర్కారు బడుల బలోపేతానికి చర్యలు
- అడ్మిషన్ల కోసం జిల్లావ్యాప్తంగా డ్రైవ్
- తల్లిదండ్రులను కలుస్తున్న ఉపాధ్యాయులు
- విద్యార్థుల సంఖ్య పెంచేందుకు కృషి



పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ముచ్చింద్రలో ఉపాధిహామీ కూలీలకు అవగాహన కల్పిస్తున్న ఎంఈవో (ఫైల్)

ఇచ్ఛాపురం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్నిరకాల ప్రయత్నాలు చేస్తోంది. అందులో భాగంగా జిల్లావ్యాప్తంగా అడ్మిషన్ల డ్రైవ్ ప్రక్రియ కొనసాగుతోంది. సమగ్ర శిక్ష అధికారులు, ఉపాధ్యాయులు బృందాలుగా ఏర్పడి అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉండే చిన్నారులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు. గిరిజన ప్రాంతాలతోపాటు మత్స్యకార గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించారు. నేరుగా పిల్లల ఇళ్ల వద్దకు, ఉపాధిహామీ పనులు చేసే కూలీల వద్దకు వెళ్లి ప్రభుత్వ ప్రోత్సాహకాలు, పథకాల గురించి వివరిస్తున్నారు. గ్రామాల్లో ర్యాలీల ద్వారా అవగాహన కల్పిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలంటూ ప్రచారం నిర్వహిస్తున్నారు.

జిల్లాలో ఇదీ పరిస్థితి..

జిల్లాలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు 1,915 ఉన్నాయి. ప్రాథమికోన్నత 315, ఉన్నత పాఠశాలలు 419 ఉన్నాయి. మొత్తంగా 2,649 పాఠశాలల్లో 1.60లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. అయితే విద్యార్థులు లేరన్న సాకుగా చూపి వైసీపీ ప్రభుత్వ హయాంలో 223 పాఠశాలలను సమీప స్కూళ్లలో విలీనం చేశారు. దీంతో జిల్లాలో పది మంది విద్యార్థులు ఉన్న పాఠశాలలు 485 ఉండడం ఆందోళన కలిగిస్తోంది. విలీనం నేపథ్యంలో మూడో తరగతికి వస్తే మరో పాఠశాలలో చేర్పాల్సి ఉండడంతో తల్లిదండ్రులు కూడా పెద్దగా ఆసక్తి చూపలేదు. ప్రైవేటు బడుల వైపు మొగ్గుచూపారు. ఫలితంగా ప్రభుత్వ పాఠశాలలు ఖాళీగా కనిపించాయి. ఇన్ని సమస్యలు ఉంచుకొని పాఠశాలల స్వరూపాన్నే మార్చేశామని వైసీపీ ప్రభుత్వం ఆర్భాటం చేసింది. నాడు-నేడు పథకంతో పాఠశాల భవనాలను నిర్మించినట్టు, ఫర్నీచర్ ఇతరత్రా సదుపాయాలు కల్పించినట్టు చెప్పింది. ఇలా పనులు చేపట్టిన వందలాది పాఠశాల భవనాలు వృథాగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో వైసీపీ పాలనలో నిర్వీర్యమైన విద్యావ్యవస్థను గాడిన పెట్టే పనిలో రాష్ట్ర ప్రభుత్వం నిమగ్నమైంది. విలీనమైన పాఠశాలలతోపాటు తరగతులను వెనక్కి రప్పించే ఏర్పాటులో ఉంది. ఇందులో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు అడ్మిషన్ డ్రైవ్ చేపడుతోంది. ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్నత పాఠశాల ఉంటే.. ప్రాథమికోన్నత పాఠశాలను కూడా కొనసాగించాలని సూత్రప్రాయంగా నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం. పంచాయతీకి ఒక ఆదర్శ పాఠశాలను ఏర్పాటుచేసి.. తరగతికి ఒక ఉపాధ్యాయుడ్ని నియమించాలన్న ప్రతిపాదనపై కూడా ఆలోచిస్తోంది. పాఠశాలల సర్దుబాటు, విలీన ప్రక్రియ, ఉపాధ్యాయుల కేటాయింపులో తప్పులను సరిదిద్దనుంది.

స్కూల్ కాంప్లెక్స్‌లు కూడా..

స్కూల్ కాంప్లెక్స్‌లను మరింత బలోపేతం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఒక్కో స్కూల్ కాంప్లెక్స్‌లో 50మంది ఉపాధ్యాయులు ఉండేలా చర్యలు చేపట్టనుంది. ఇప్పటివరకూ ప్రతి మండలంలో 10 నుంచి 12వరకూ స్కూల్ కాంప్లెక్సులు ఉండేవి. ప్రభుత్వ తాజా నిర్ణయంతో వాటి సంఖ్య సగానికి తగ్గే అవకాశం ఉంది. నిర్దేశిత సంఖ్యలో ఉపాధ్యాయులు స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలకు హాజరైతే బోధన, ఇతరత్రా అంశాలపై ఉపాధ్యాయులకు మరింత అవగాహన పెరిగే అవకాశం ఉంది. గత ఐదేళ్లలో స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు తూతూమంత్రంగా జరిగాయి. పాఠశాలలపై హెచ్‌ఎంల పర్యవేక్షణ కూడా తగ్గడంతో విద్యాబోధన, పరీక్ష ఫలితాలపై ప్రభావం చూపింది. అందుకే తిరిగి హెచ్‌ఎంలకే పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించనుంది. మండలానికి ఒక ఎంఈవోను పరిమితం చేయనుంది.

జిల్లా వ్యాప్తంగా డ్రైవ్..

జిల్లావ్యాప్తంగా అడ్మిషన్ల డ్రైవ్ కొనసాగుతోంది. వేసవి సెలవుల ప్రారంభానికి ముందుగానే ఈ కార్యక్రమాన్ని చేపట్టాం. సమగ్ర శిక్ష అధికారులు, సిబ్బంది, విద్యాశాఖ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నారు. తల్లిదండ్రుల నుంచి సానుకూలతలు వస్తున్నాయి. ఎలాగైనా ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది.

-తిరుమల చైతన్య, డీఈవో, శ్రీకాకుళం

ఆరు రోజులుగా ఎదురుచూపు

- పోలాండ్‌లో కైజోల వాసి మృతి
- మృతదేహాన్ని స్వగ్రామానికి తెప్పించాలని కుటుంబ సభ్యుల వేడుకోలు
- కేంద్రమంత్రి, ఎమ్మెల్యేకి వినతి



దామోదర్ (ఫైల్)

పలాస రూరల్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): ఉపాధి కోసం రెండున్నరేళ్ల కిందట పోలాండ్ దేశం వెళ్లాడు. అక్కడ ఓ కంపెనీలో వెల్డింగ్ పనిచేస్తూ.. వచ్చిన డబ్బుల్లో కొంతమొత్తాన్ని స్వగ్రామంలో కుటుంబ సభ్యులకు పంపించేవాడు. కానీ అక్కడ ఏమి జరిగిందో.. ఏమో ఈ నెల 21న తాను ఉంటున్న ఇంట్లోనే విగతజీవిగా మారాడు. ఆయన మరణించిన సమాచారం తెలుసుకుని తల్లిదండ్రులు, భార్యా పిల్లలు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఆయన మృతదేహం కోసం ఆరు రోజులుగా ఎదురుచూస్తూనే ఉన్నారు. వివరాల్లోకి వెళితే.. పలాస మండలం కైజోల గ్రామానికి చెందిన బుడద దామోదర్(30) ఈ నెల 21న పోలాండ్ దేశంలో మృతి చెందాడు. దామోదర్‌కు తల్లిదండ్రులు లక్ష్మీనారాయణ, పున్నమ్మ, ఇద్దరు అన్నదమ్ములు, భార్య నీలవేణి, ఇద్దరు కుమారులు ఉన్నారు. వీరిది ఉమ్మడి కుటుంబం. తండ్రి దివ్యాంగుడు. మరో అన్నయ్య కూడా దివ్యాంగ పరిస్థితిలోనే ఉండడంతో దామోదర్ కుటుంబ బాధ్యతలు చూసుకునేవాడు. ఐటీఐ వృత్తి విద్య కోర్సుచేసి వెల్డర్‌గా పలు కంపెనీల్లో పనిచేశాడు. ఆ అనుభవంతో రెండున్నరేళ్ల కిందట పోలాండ్ దేశం వార్సాలో ఓ కంపెనీలో చేరాడు. అక్కడ వెల్డింగ్ పనులు చేస్తూ ఉపాధి పొందేవాడు. గతేడాది డిసెంబరులో స్వగ్రామానికి వచ్చి కుటుంబ సభ్యులతో సరదాగా గడిపాడు. పోలాండ్‌లో మరో కంపెనీలో చేరేందుకు సన్నాహాలు చేస్తున్నట్టు వారికి చెప్పాడు. కొద్ది రోజుల తర్వాత జనవరిలో తిరిగి పోలాండ్ వెళ్లిపోయాడు. ఇంతలో ఏమైందో.. కానీ తాను నివసిస్తున్న ఇంట్లోనే దామోదర్ మృతి చెందినట్టు ఈ నెల 21న కుటుంబ సభ్యులకు సమాచారం అందింది. దీంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. తమకు ఇక దిక్కెవరంటూ విలపించారు. ఆరు రోజులుగా ఆయన మృతదేహం కోసం ఎదురు చూస్తున్నారు. పోలెండ్ నుంచి దామోదర్ మృతదేహాన్ని తీసుకువచ్చేలా ఏర్పాట్లు చేయాలని కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు, పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషను కుటుంబ సభ్యులు వేడుకున్నారు. ఈ మేరకు కేంద్రమంత్రి ఆ వివరాలను విదేశీ రాయబారుల శాఖ ఆధ్వర్యంలో పోలెండ్ రాయబార కార్యాలయానికి చేరవేసినట్టు సమాచారం. ఆదివారం ఆయన మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకువచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈ ఘటనతో గ్రామస్థులు విషాదంలో మునిగిపోయారు.



దీనంగా ఎదురుచూస్తున్న దామోదర్ భార్య నీలవేణి, కుమారులు



సీఎం చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్, విజయనగరం ఎంపీ కలిశెట్టి, ఎమ్మెల్యేలు ఎంజీఆర్, గౌతు శిరీష, బెందాళం అశోక్, కూన రవికుమార్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కలమట, జనసేన నేత చంద్రమోహన్

కూటమిగా ఉంటూనే బలపడదాం

- ఎచ్చెర్ల టీడీపీ శ్రేణులకు చంద్రబాబు పిలుపు
- ఎమ్మెల్యే ఎన్ఈఆర్ సమన్వయంపై అభినందన
- ఆయన నాయకత్వంలో ముందుకెళ్లండి
- తెలుగుదేశం శ్రేణుల సమావేశంలో అధినేత

రణస్థలం/ఎచ్చెర్ల, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి)

కూటమి ధర్మానికి కట్టుబడి ఉంటూనే ఎచ్చెర్ల నియోజకవర్గంలో టీడీపీ అభివృద్ధికి కృషి చేయాలని పార్టీ శ్రేణులకు సీఎం చంద్రబాబు పిలుపు నిచ్చారు. ఎచ్చెర్ల మండలం బుడగట్లపాలెంలో మత్స్యకారుల సేవలో కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం చివరిగా ఎచ్చెర్ల టీడీపీ శ్రేణులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు చంద్రబాబు. మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, టీడీపీ విజయనగరం జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జున హాజరయ్యారు. ఎచ్చెర్ల, రణస్థలం, జి.సిగడాం లావేరు మండలాల పార్టీ శ్రేణులు హాజరయ్యాయి. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు బీజేపీ ఎమ్మెల్యే నడికుదుటి ఈశ్వరరావు చక్కటి సమన్వయంతో తమను కలుపుకెళుతున్నట్టు తెలిపారు. దీనిపై చంద్రబాబు సైతం సంతృప్తి వ్యక్తం చేశారు. అంతకు ముందు బహిరంగ సభలోనూ ఎమ్మెల్యే ఎన్ఈఆర్ ప్రస్తావన వచ్చినప్పుడు చంద్రబాబు సానుకూలంగా స్పందించారు. కూటమిని సమన్వయం చేయడంలో ఎన్ఈఆర్ చక్కగా పని చేస్తున్నారని కొనియాడారు. టీడీపీ సభ్యత్వ నమోదులో మరింత చురుగ్గా వ్యవహరించాల్సి ఉండాల్సిందని చంద్రబాబు అభిప్రాయపడ్డారు. 2029 ఎన్నికల్లో సైతం ఇదే సమన్వయంతో వ్యవహరించాలని పార్టీ శ్రేణులకు ఉద్బోధించారు. బీజేపీ ఎమ్మెల్యే అయినా పార్టీ శ్రేణులకు చక్కగా సమన్వయం చేసుకుంటున్నందున..ఆయన నాయకత్వంలో ముందుకెళ్లాలన్నారు. క్షేత్రస్థాయిలో చిన్న చిన్న ఇబ్బందులు సహజమని..వాటిని సరిదిద్దుకుంటూ ముందుకు సాగాలని సూచించారు. ప్రతి మూడు నెలలకు ఒక్కసారి సమీక్షా సమావేశం ఉంటుందన్నారు. ఇటీవల పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో బాగా పనిచేసిన కార్యకర్తల పేర్లు చదివి అభినందించారు. నామినేటెడ్ పదవులతో పాటు ఇతర పదవుల భర్తీ విషయంలో పార్టీ శ్రేణులకు న్యాయం చేస్తానని చంద్రబాబు హామీ ఇచ్చారు. మండలాల వారీగా పార్టీ పరిస్థితులపై ఆరా తీశారు. చక్కగా పనిచేసుకోవాలని సూచించారు. సమావేశంలో మండల పార్టీ అధ్యక్షులు లంక శ్యామలరావు, ముప్పిడి సురేష్, బెందు మల్లేశ్వరరావు, కొమరాపు రవి, చౌదరి బాబ్జి, పిన్నింటి భానోజీనాయుడు, డీజీఎం ఆనందరావు, పిసిని జగన్నాథంనాయుడు, నాలుగు మండలాల నుంచి దాదాపు 500 మంది నేతలు, కార్యకర్తలు హాజరయ్యారు.



సమావేశానికి హాజరైన ఎచ్చెర్ల టీడీపీ నేతలు, కార్యకర్తలు



చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న డీఐజీ గోపీనాథ్ జెట్టి, ఎస్పీ మహేశ్వరరెడ్డి

ముఖ్యమంత్రికి ఘన స్వాగతం

శ్రీకాకుళం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల మండలం బుడగట్లపాలెం గ్రామంలో 'మత్స్యకారుల సేవలో' పథకం ప్రారంభించేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడికి శనివారం వచ్చారు. కూటమి నేతలు ఆయనకు ఘన స్వాగతం పలికారు. హెలికాప్టర్‌లో బుడగట్లపాలెం చేరుకున్న సీఎంకు హెలీప్యాడ్ వద్ద కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ఎమ్మెల్యేలు గౌతు శిరీష, కూన రవికుమార్, గొండు శంకర్, మామిడి గోవిందరావు, నడుకుదిటి ఈశ్వరరావు, కోండ్రు మురళీమోహన్, అదితి గజపతిరాజు, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, కేంద్ర మంత్రి అశోక్ గజపతిరాజు, మాజీ స్పీకర్ కావలి ప్రతిభాభారతి, జిల్లా టీడీపీ అధ్యక్షుడు కలమట వెంకటరమణ, బీజేపీ జిల్లా అధ్యక్షులు సిరిపురం తేజేశ్వరరావు తదితరులు స్వాగతం పలికి.. పుష్పగుచ్ఛాలు అందించారు.

27 వేల మందికి అదనంగా 'మత్స్యకార భరోసా'

- మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

ఎచ్చెర్ల/రణస్థలం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ పాలకులు మత్స్యకారులకు తీరని అన్యాయం చేశారని... ఈ ఏడాది అదనంగా 27 వేల మందికి మత్స్యకార భరోసా అందజేస్తున్నామని రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. బుడగట్లపాలెంలో శనివారం మత్స్యకార భరోసా పంపిణీ కార్యక్రమాన్ని సీఎం చంద్రబాబునాయుడు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అచ్చెన్న మాట్లాడుతూ మత్స్యకారులు టీడీపీ ఆవిర్భావం నుంచి మద్దతుగా నిలిచారన్నారు. మత్స్యకార గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించిన ఘనత టీడీపీదేని చెప్పారు. 2024 ఎన్నికల్లో ఎన్‌డీఏ కూటమికి మద్దతుగా నిలిచి పట్టం కట్టారని చెప్పారు. చేపల వేట నిషేధ సమయంలో భరోసాను ముందుగా సీఎం చంద్రబాబే ప్రారంభించారని గుర్తు చేశారు. గత ప్రభుత్వంలో రూ.10 వేలు ఇస్తే... దీన్ని రెట్టింపు చేసి మత్స్యకారులకు ఆదుకున్నట్టు చెప్పారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సహకరించకపోయినా ఇచ్చిన మాట నిలబెట్టుకోవడం కోసం భరోసాను రెట్టింపు చేసినట్టు తెలిపారు. గత ప్రభుత్వం పోర్టు నిర్మాణాన్ని భావనపాడు నుంచి మూలపేటకు మార్చిందని... దీనిని నిలుపుదల చేయకుండా పనులు వేగవంతమయ్యేలా చర్యలు తీసుకున్నామన్నారు. ఆరేడు నెలల్లో మూలపేట పోర్టును ప్రారంభిస్తామని మంత్రి అచ్చెన్న చెప్పారు.

కోస్టల్ కారిడార్‌తో ఎంతో అభివృద్ధి

- కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు

సముద్రతీర ప్రాంతాన్ని కోస్టల్ కారిడార్‌గా అభివృద్ధి చేస్తే ఎంతో ప్రయోజనం ఉంటుందని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు అన్నారు. సీఎం చంద్రబాబు అంటేనే ఒక నమ్మకం, ధైర్యమని చెప్పారు. తడ నుంచి ఇచ్ఛాపురం వరకు తీర ప్రాంతంలోని అన్ని స్థానాలలో ఎన్‌డీఏ కూటమికే ప్రజలు పట్టం కట్టారన్నారు. తీర ప్రాంతాల్లోని చెరువులను లాక్కొనేందుకు గత ప్రభుత్వం చేసిన జీవో 0217ను రద్దు చేసినట్టు చెప్పారు. పోర్టు, జెట్టీలు, హార్బర్‌లు, పరిశ్రమలు ఏర్పాటైతేనే మరింత అభివృద్ధి సాధించగలమన్నారు. శ్రీకాకుళం జిల్లాలో కూడా ఎయిర్‌పోర్టును ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే మత్స్యకారుల అభ్యున్నతి

- మంత్రి కొల్లు రవీంద్ర

మత్స్యకారుల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. సముద్ర తీర గ్రామాల్లో గురుకుల పాఠశాలలు, మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు చేపల వేట నిషేధ సమయంలో గతంలో కేవలం బియ్యం మాత్రమే మత్స్యకారులకు అందజేశారని, తొలిసారిగా ముఖ్యమంత్రి చంద్రబాబే నగదు అందజేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని గుర్తు చేశారు. వైసీపీ ప్రభుత్వంలో ఫిష్ ఆంధ్ర పేరిట రూ.100 కోట్లు దోపిడీ అయ్యిందన్నారు. మత్స్యకారులకు 50 ఏళ్లకే సామాజిక పింఛను అందజేస్తున్నట్టు చెప్పారు..



మత్స్యకారులతో సీఎం చంద్రబాబు



స్క్రీన్‌పై కార్యక్రమాన్ని తిలకిస్తూ...

డ్వాక్రా సంఘాలతో పేదరిక నిర్మూలన

- జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండపల్లి శ్రీనివాస్

మహిళల ఆర్థిక స్వావలంబనకు, పేదరిక నిర్మూలనకు డ్వాక్రా సంఘాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. మత్స్యకార సేవ పేరిట బుడగట్లపాలెం గ్రామంలో కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమని చెప్పారు.

సీఎం పర్యటన సాగిందిలా...

ఎచ్చెర్ల/రణస్థలం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): బుడగట్లపాలెం గ్రామానికి సీఎం శనివారం మధ్యాహ్నం 12.30 గంటలకు చేరుకున్నారు. స్థానికంగా ఉన్న అమ్మవారి గుడిని మధ్యాహ్నం 12.48 గంటలకు సందర్శించారు. అక్కడ ప్రజల వద్దకు వెళ్లి అభివాదం చేశారు. తర్వాత నేరుగా సముద్ర తీరానికి వెళ్లి కొంతమంది మత్స్యకారులతో ముఖాముఖి నిర్వహించారు. వలలను సరిచేసుకోవడాన్ని, బోటు మరమ్మతులను, ఐస్ బాక్సుల వద్ద, ఎండు చేపలను ఆరబెట్టిన వారితో వేర్వేరుగా మాట్లాడి... కష్టసుఖాలను తెలుసుకున్నారు. అలాగే చేపలు వేటాడి వచ్చిన వారితో కూడా మాట్లాడారు. అక్కడి నుంచి మధ్యాహ్నం 2.25 గంటల సమయంలో మత్స్యకారుల సేవలో కార్యక్ర మానికి సంబంధించిన ప్రజా వేదికకు చేరుకుని సాయం త్రం 4.40 గంటల వరకు అక్కడే ఉన్నారు. ఆ తర్వాత ప్రత్యేకంగా పార్టీ శ్రేణులతో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడారు. సాయంత్రం 5.42 గంటల సమయంలో హెలికాప్టర్‌లో ఆయన విశాఖపట్నానికి బయలుదేరారు.



తాటిచెట్టు కింద సేదదీరుతూ..



సాగునీరు అందించాలి

- స్థానికులకు ఉపాధి కల్పించాలి
- ఎచ్చెర్ల నియోజకవర్గాన్ని ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దాలి
- స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి

రణస్థలం/ఎచ్చెర్ల, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ఎచ్చెర్ల నియోజకవర్గం పూర్తిగా మెట్ట ప్రాంతమని.. పూర్తి స్థాయిలో సాగునీటి వనరులు లేక రైతులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. శనివారం బుడగట్లపాలెంలో జరిగిన మత్స్యకార సేవలో కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తోటపల్లి కాలువను ఆధునికీకరించి... ఈ ఏడాది నీరు విడుదల చేయాలని సీఎం చంద్రబాబునాయుడును కోరారు. అదేవిధంగా 380 ఎకరాలలో ఉన్న బుడుమూరు చెరువును మినీ రిజర్వాయర్‌గా చేయాలని కోరారు. బుడుమూరు గెడ్డను ఆధునికీకరించాలని... ఎచ్చెర్ల మండలంలో ఉన్న నారాయణపురం కాలువను పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. మత్స్యకారుల చిరకాల వాంఛ అయిన బుడగట్లపాలెం ఫిషింగ్ హార్బర్ పనులు త్వరితగతిన పూర్తి చేస్తే వలసలు అరకట్టవచ్చునని చెప్పారు. ఎచ్చెర్ల నియోజకవర్గాన్ని ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దాలన్నారు. స్థానిక రసాయనిక పరిశ్రమల్లో యువతకు ఉపాధి అంతంత మాత్రంగానే ఉందన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాన్ని ఏర్పాటు చేసి.. యువతకు శిక్షణ ఇచ్చి స్థానిక పరిశ్రమల్లో పూర్తి స్థాయిలో ఉపాధి కలించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కొవ్వాడ అణువిద్యుత్ కేంద్రం పనులు పూర్తి చేయాలని, బాధితులకు ధర్మవరంలో పునరావాసం కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఎన్ఈఆర్ కోరారు. పార్టీ కోసం కష్టపడే కార్యకర్తలకు మంచి భవిష్యత్ ఉంటుందని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. మత్స్యకారుల సంక్షేమం కోసం ఆది నుంచి టీడీపీ కృషి చేస్తుందన్నారు. తనలాంటి కార్యకర్తను ఎంపీ స్థానంలో నిలబెట్టిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు రుణపడి ఉంటానని చెప్పారు.



ప్రజలకు అభివాదం చేస్తున్న ప్రతిభాభారతి

అశోక్ గారూ.. ఇంత ఎండలో వచ్చేశారా?

- హెలీపాడ్ వద్ద ఆసక్తికర సంభాషణ
- ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడుకు ప్రశంసలు



ఎచ్చెర్ల/రణస్థలం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ఎచ్చెర్ల మండలం బుడగట్లపాలెం సముద్ర తీరంలో ఏర్పాటుచేసిన హెలీపాడ్ వద్ద స్వాగతం పలికేందుకు వచ్చిన కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్ గజపతిరాజును చూసి సీఎం చంద్రబాబునాయుడు 'అశోక్ గారూ.... ఇంత ఎండలో వచ్చేశారా' అంటూ సరదాగా ప్రశ్నించారు. దీనికి అశోక్‌గజపతిరాజు స్పందిస్తూ... 'మా నాయకుడు వస్తే... నేను రాకుండా ఉండగలనా' అన్నారు. దీంతో సీఎం ఒక్కసారిగా నవ్వేశారు. అలాగే గతంలో తాను ప్రాతినిధ్యం వహించిన పార్లమెంటరీ నియోజకవర్గం కూడా ఇదే కదా అని గుర్తు చేశారు. ప్రస్తుత ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు చాలా చక్కగా చేస్తున్నారంటూ అశోక్ గజపతిరాజు..కలిశెట్టి భుజం తట్టారు. దీనికి సీఎం స్పందిస్తూ... 'అవునవును. ఇక్కడే కాదు.. ఢిల్లీలో కూడా ఎంపీ అప్పలనాయుడు తనదైన రీతిలో పని చేసుకుంటున్నార'ని సీఎం అభినందించారు.

మాట ఇచ్చాం.. నిలబెట్టుకున్నాం

(ఐదో పేజీ తరువాయి)

విరామ సమయంలో మత్స్యకారులకు ఆర్థిక సహాయాన్ని రూ.10వేల నుంచి రూ.20వేల వరకు పెంచామ'ని సీఎం తెలిపారు

● అభివృద్ధి అంటే బటన్ నొక్కడం కాదు..

'గత పాలకుల్లా బటన్ నొక్కి ప్రచారం చేసుకోవడం నాకూ వచ్చు. కానీ చేయాల్సింది అదికాదు. ప్రజలందరికీ సంక్షేమం అందించడమే నా ధ్యేయం. గత పాలకులు ఫిష్ ఆంధ్ర పేరుతో రూ.300 కోట్లు ఖర్చు పెట్టామన్నారు. ఒక్క మత్స్యకారుని కుటుంబమైనా బాగుపడిందా? టీడీపీ ప్రభుత్వం హయాంలోనే మత్స్యకారుల పిల్లలకు ప్రత్యేకంగా ఆరు రెసిడెన్షియల్ పాఠశాలలు ఏర్పాటు చేశాం. రాష్ట్రంలో 68,396 మంది మత్స్యకారులకు ప్రతినెలా పింఛన్లు అందిస్తున్నాం. మత్స్యకారులు చేపల వేట సమయంలో మరణిస్తే రూ.10లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లిస్తున్నాం. వేటకు వెళ్లే బోట్లకు లీటర్ డీజిల్‌పై రూ. 9 సబ్సిడీ ఇస్తున్నామ'ని సీఎం తెలిపారు.

● దేశమంతా శ్రీకాకుళం వాసులే..

'హైదరాబాద్, ఢిల్లీ సహా దేశంలోని పలు ప్రాంతాల్లో శ్రీకాకుళం కాలనీలు ఉంటాయి. ఆర్మీలో శ్రీకాకుళం జిల్లా వాసులే అధికంగా ఉన్నారు. జిల్లాలో తెలివితేటలున్న నాయకులకు కొరత లేదు. నాగావళి, వంశధార ద్వారా నీరు సమృద్ధిగా వస్తుంది. జిల్లా వెంబడి ఎక్కువ జాతీయ రహదారులు ఉన్నాయి. ఇక్కడి ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు మంచి వాక్చాతుర్యం కలిగిన వ్యక్తి. జిల్లాకు చెందిన సామాన్య టీడీపీ కార్యకర్త కలిశెట్టి అప్పలనాయుడు ఎంపీ అయ్యారు. ముచ్చటగా మూడోసారి గెలిచిన కింజరాపు రామ్మోహన్ నాయుడు కేంద్రమంత్రి అయ్యాడు. ప్రజల తలసరి ఆదాయం తక్కువగా ఉన్న జిల్లా శ్రీకాకుళమే. జిల్లాలో తలసరి ఆదాయం ఎక్కువగా ఉన్న ప్రాంతం ఎచ్చెర్ల కాగా.. తక్కువగా ఉన్న ప్రాంతం బుడగట్లపాలెం. నేను భోగాపురం ఎయిర్ పోర్టు తీసుకువస్తే గత పాలకులు దాన్ని అటకెక్కించారు. మళ్లీ నేనే దాన్ని పూర్తిచేస్తాను. ఆనాడు నా మిత్రుడు కింజరాపు ఎర్రన్నాయుడు కేంద్రమంత్రిగా ఉన్నప్పుడు ఉద్దానానికి నీళ్లు తెచ్చారు. ఆయన కుమారుడు రామ్మోహన్‌నాయుడు ఆధ్వర్యంలో భోగాపురం ఎయిర్‌పోర్టు పూర్తికాబోతుంది. రామ్మోహన్ నాయుడు పనితీరును ఢిల్లీ నాయకులు గొప్పగా చెబుతున్నారు. అయితే శ్రీకాకుళం అభివృద్ధి కాకపోతే నీ డిగ్రీ తిరిగి ఇవ్వాల్సిందేనని రామ్మోహన్‌కు నేను తేల్చి చెప్పాను' అని సీఎం అన్నారు.

● ఎచ్చెర్ల నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తా...

'ఎచ్చెర్ల నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తాం. ప్రజల జీవన ప్రమాణాలు పెంచుతాం. నియోజకవర్గంలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేస్తాం. 9 ఫిషింగ్ హార్బర్లు సిద్ధం చేస్తున్నాం. బోట్లు కొనిచ్చి గ్రామాన్ని ఒక సెంటర్‌గా తీసుకుని ఆర్థికంగా ఆదుకుంటాం. ఏడాదిలో బుడగట్లపాలెం ఫిషింగ్ హార్బర్‌ను పూర్తిచేసి ప్రారంభిస్తాం. ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఈశ్వరరావు కోరిన సమస్యలలో నారాయణపురం, మడ్డువలస స్టేజ్-2, తోటపల్లి కాలువ.. ఈ మూడు పూర్తి చేసి అభివృద్ధి చేసే బాధ్యత తీసుకుంటా. అణువిద్యుత్ కేంద్రం ఆర్అండ్ఆర్, పీడీఎఫ్ ఇవాల్సిన బాధ్యత తీసుకుంటా. పేదరికం ఉండకూడన్న లక్ష్యంతో బంగారు కుటుంబాలు.. మార్గదర్శకులను తీసుకు వచ్చాను. ఈ గ్రామంలో 499 ఇళ్లు ఉన్నాయి. 18 మందికి ఇంటి జాగాలేదు. 6 నెలల్లోగా ఇళ్లు ఇవ్వాలని కలెక్టర్లను ఆదేశిస్తున్నాను. స్థానిక ఎమ్మెల్యే ఈశ్వరరావు బాగా పనిచేస్తున్నారు. రిజర్వాయర్లు సహా కాలువలు పూర్తిచేసి ఎచ్చెర్లను సస్యశ్యామలం చేస్తాం. భావనపాడు పోర్టును నిర్మించాలనుకున్నాం. గత పాలకులు దాన్ని మూలపేటకు తెచ్చారు. ఐదేళ్లు ఆలస్యమైంది. రాబోయే సంవత్సరంలో మూలపేట పోర్టు పూర్తి చేస్తాం. ఇక్కడి ప్రజల ఆదాయం పెరగాలి. దీనికోసం విధానపరమైన నిర్ణయాలు తీసుకుంటున్నా. ప్రతి ఇంటికి గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్ల భూమి, పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్ల భూమి ఇవ్వాలని ఇక్కడే కలెక్టర్‌కు ఆదేశాలు ఇస్తున్నా. ఆరు నెలల్లో అందరికీ ఇళ్లు ఇచ్చే బాధ్యత కలెక్టర్‌ది. 371 ఇళ్లు ఉండగా.. 170 ఇళ్లు శాశ్వత నిర్మాణాలు కావు. అలాగే కూలిన ఇళ్లకు ఇళ్లను మంజూరుచేసి వాటినిర్మాణ బాధ్యత అధికారులు చూడాలి. కరెంట్ కనెక్షన్, సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు చేస్తున్నాం. గ్యాస్ కనెక్షన్‌లు.. 32ఇళ్లకు లేవు. వాటినీ మంజూరు చేస్తున్నాం. జలజీవన్ మిషన్ పనుల గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో పూర్తికాలేదు. అవి పూర్తయ్యే వరకు నీరిచ్చే బాధ్యత అధికారులే తీసుకోవాలి. 2,430 మీటర్ల సీసీ రోడ్లు అవసరముంది. వాటిని మంజూరు చేసి పూర్తిచేయాలి. ప్రస్తుతం జనాభా సంఖ్య తగ్గుతోంది. పిల్లలను కనే బాధ్యత ప్రతి భార్య, భర్త తీసుకోండి. వారిని చదివించే బాధ్యత మాది. సీవీల్ తయారు చేసుకుంటే మంచి సంపద లభిస్తుంది. హెక్టార్‌కు కనీసం పది లక్షల ఆదాయం వస్తుందని మా అధికారులు చెబుతున్నారు. ఈ ఊరిలో సీవీల్‌ను పైలెట్ ప్రాజెక్టుగా ఏర్పాటుచేస్తాం. ఈ ఊరు బాగుపడితే అన్ని మత్స్యకార గ్రామాలకు ఆ విధానం తీసుకువెళ్తాం. సముద్రం దగ్గరలోనే చేపలు ఉత్పత్తి అయ్యేలా ఆర్టిఫిషియల్ టీమ్స్ ఏర్పాటు చేస్తాం. దీనివల్ల ముప్పై శాతం సమయం ఆదా అవుతుంది. ఆదాయం మూడు రెట్లు పెరుగుతుంది. అనకాపల్లిలో రూ.లక్ష కోట్ల పెట్టుబడితో స్టీల్‌ప్లాంట్ వస్తోంది. దీనివల్ల 40 వేల మందికి ఉపాధి లభించనుంది' అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. అనంతరం తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు.


టెక్కలి: కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న తైక్వాండో క్రీడాకారులు


వజ్రపుకొత్తూరు: పూండిలో కొవ్వొత్తుల ర్యాలీ..


కవిటి: కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న దృశ్యం

కఠినంగా శిక్షించాలి

● పహల్గాం దాడి ఘటనపై జిల్లా వ్యాప్తంగా నిరసన

జమ్మూ కశ్మీర్ రాష్ట్రం పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదులు చేసిన దాడిని నిరసిస్తూ శనివారం జిల్లా వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు జరిగాయి. కొవ్వొత్తులు పట్టుకుని మృతులకు సంతాపం తెలియజేశారు. దాడులకు పాల్పడినవారిని కఠినంగా శిక్షించాలని నినాదాలు చేశారు.

- ఆంధ్రజ్యోతి బృందం


కోటబొమ్మాళి: పాకివలసలో శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న గ్రామస్థులు


ఆమదాలవలస: సంతాపం వ్యక్తం చేస్తూ మౌనం పాటిస్తున్న క్రికెటర్లు


ఇచ్ఛాపురం: సురంగ రాజా మైదనాంలో..

రేపు మహిళా క్రికెట్ జట్ల ఎంపిక

శ్రీకాకుళం స్పోర్ట్స్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి మహిళా క్రి కెట్ జట్ల ఎంపికలు ఈ నెల 28వ తేదీన నిర్వహించనున్నట్టు జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్షుడు పీవైఎస్ శాస్త్రి, కార్యదర్శి హసన్‌రాజా షేక్, మెంటార్ ఇలియాస్ మహ్మద్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానంలో ఉదయం 8 గంటలకు ఈ ప్రక్రియ ప్రారంభిస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ ఎంపికలు అండర్-15, 19, సీనియర్ విభాగాల్లో ఉంటాయని, ఇందులో ఎంపికైన వారు అంతర్ జిల్లాల పోటీలకు పంపనున్నట్టు తెలిపారు. ఆసక్తి, అర్హత గల క్రీడాకారులు జనన ధ్రువపత్రంతోపాటు ఆధార్ కార్డుతో హాజరుకావాలన్నారు.

రేపటి నుంచి వేసవి విజ్ఞాన శిబిరం

శ్రీకాకుళం కల్చరల్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): వేసవి సెలవులు నేపథ్యంలో జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఈ నెల 28 నుంచి జూన్ 6వ తేదీ వరకు వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహించనున్నట్టు గ్రంథాలయ కార్యదర్శి బి.కుమార్ రాజు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతి రోజు ఉదయం 7గంటల నుంచి 11 గంటల వరకు ఉంటుందన్నారు. వివిధ అంశాల్లో శిక్షణ, కథలు వినుట, పుస్తక పఠనం, పుస్తక సమీక్షలు, పెద్దల నుంచి విన్న అముద్రిత కథలు చెప్పుట, చిత్రలేఖనం, పేపర్ ఆర్ట్, స్పోర్ట్స్ అండ్ గేమ్స్ వంటి వాటిపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తామన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ప్రభుత్వ విద్యతో ఉజ్వల భవిష్యత్తు

ఆమదాలవలస, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో తమ పిల్లలను చేర్పించి వారి ఉజ్వల భవిష్యత్తుకు పాటుపడాలని టీడీపీ జిల్లా బీసీ సెల్ కార్యదర్శి, ఎస్ఎంసీ చైర్మన్ నాగళ్ల మురళీధర్‌యాదవ్ అన్నారు. శనివారం పురపాలక సంఘం పరిధిలోని పదో వార్డు గాంధీనగర్ పాఠశాల ప్రాంతంలో టీడీపీ శ్రేణులతో కలిసి ఇంటింటా సందర్శించి, తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ జి.సింహాద్రి, టీడీపీ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శనిత్రయోదశి పూజలు



ఇచ్ఛాపురం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): శనిత్రయోదశి పూజలు శనీశ్వర ఆలయాల్లో నిర్వహించారు. శనివారం వేకువ జామునుంచే శనీశ్వర ఆలయాల వద్ద భక్తులు పోటెత్తారు. పట్టణ పరిధిలో గల చిదంబరేశ్వర, రామలింగేశ్వర, కాశీవిశ్వనాథ, నీలకంఠేశ్వర, పాతాళ సిద్ధేశ్వర ఆలయం ఆవరణల్లో గల శనీశ్వర ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

దల్లాం చెరువును మినీరిజర్వాయర్‌గా అభివృద్ధి చేస్తా

● పల్లెనిద్రలో ఎమ్మెల్యే శంకర్

గార, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): శ్రీకూర్మంలో వేలాది ఎకరాలకు సాగునీరు అందించే దల్లాం చెరువును మినీ రిజర్వాయరుగా అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. పల్లెనిద్ర కార్యక్రమంలో భాగంగా శనివారం ఉదయం ఆయన గ్రామస్థులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ చెరువును మినీ రిజర్వాయర్‌గా అభివృద్ధి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటానన్నారు. పల్లెనిద్ర నిర్వహించిన గ్రామాల్లో స్థానికులు తన దృష్టికి తీసుకువచ్చిన సమస్యలు పరిష్కారానికి చర్యలు చేపడతానన్నారు. ముఖ్యంగా చింతవలస, పంగపేట గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ గోర సురేష్, డిస్ట్రిబ్యూటరీ చైర్మన్ వీఎస్ గిరి. పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ మాజీ అధ్యక్షుడు మైగాపు ప్రభాకరరావు, మాజీ సర్పంచ్ కోరాడ వెంకటరావు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

చంద్రబాబు దృష్టికి నియోజకవర్గ సమస్యలు

శ్రీకాకుళం/అరసవల్లి, ఏప్రిల్ 26(ఆంధ్ర జ్యోతి): పెద్దగన గళ్లవానిపేట, కళింగపట్నం వద్ద వంశధార, నాగావళి నదుల దిశ మారడంతో సముద్ర తీరం కోతకు గురవుతుందని, ఆయా ప్రాంతాల్లో రక్షణ గోడ నిర్మించాలని ముఖ్య మంత్రి చంద్రబాబును ఎమ్మెల్యే గొండు శంకర్ కోరారు. ఈ మేరకు శనివారం ఎచ్చెర్ల మండలం బుడగట్లపాలెం వచ్చిన చంద్రబాబును సమావేశం అనం తరం ఎమ్మెల్యే శంకర్ కలిసి తన నియో జకవర్గంలో నెలకొన్న సమస్యలను వివ రించారు. దీని పరిష్కారానికి కృషి చేస్తా నని హామీ ఇచ్చారని తెలిపారు. ముఖ్య మంత్రి చంద్రబాబు పర్యటన జిల్లాలో విజయవంతంగా ముగియ డంతో జిల్లా అధికార యంత్రాంగానికి మంత్రి అచ్చె న్నాయుడు అభినందనలు తెలిపారు.


ముఖ్యమంత్రి చంద్రబాబుకు సమస్య వివరిస్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్

మట్టి నమూనాలు సేకరణ


మట్టి నమూనాలు సేకరిస్తున్న దృశ్యం

బూర్జ, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో గ్రామ వ్యవసాయ సహాయకులు శనివారం ఏవో ఎన్.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మట్టి నమూనాలు సేకరించారు. మండలంలో 997 మట్టి నమూనాలు లక్ష్యంగా నిర్దేశించికున్నట్టు ఏవో తెలిపారు. మట్టి నమూనాలు ద్వారా ఏ పంటలను సాగు చేయవచ్చునేది తెలుసుకోవచ్చని, తద్వారా చీడపీడల నుంచి పంటలను రక్షించుకోవచ్చన్నారు. ఎరువులు ఏ మోతాదులో వేసుకోవాలో ముందు తెలుసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు హేమ, ఇంద్రజ, వసంత, రైతులు తవిటి నాయుడు, వరలక్ష్మి, అనంతరావు, కోటేశ్వరరావు, తిరుపతిరావు పాల్గొన్నారు.

కోర్టు తీర్పు వచ్చేవరకు కౌన్సిలర్‌గా గుర్తించాలి


వినతి పత్రాన్ని అందిస్తున్న స్వర్ణమణి

ఇచ్ఛాపురం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): కోర్టు తీర్పు వచ్చే వరకు కౌన్సిలర్‌గా గుర్తించాలని 7వ వార్డు కౌన్సిలర్ లాబాల స్వర్ణమణి కోరారు. ఈ మేరకు ఆమె మునిసిపల్ ఇన్‌చార్జి కమిషనర్‌ను శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తన సభ్యత్వం రద్దు చేస్తూ గత నెలలో కౌన్సిల్ తీర్మానం చేసిందని, దీనిపై కోర్టును ఆశ్రయించానన్నారు. తీర్పు వచ్చే వరకు మునిసిపల్ చట్టంలోని సెక్షన్-17(3) ప్రకారం కౌన్సిలర్‌గా తనకు అన్ని హక్కులు ఉంటాయన్నారు. ఈ నెల 30న నిర్వహించనున్న కౌన్సిల్ సమావేశానికి సంబంధించి అజెండా కాపీ ఎందుకు పంపించలేదని ఇన్‌చార్జి కమిషనర్‌ను ప్రశ్నించారు. ఇప్పటికైనా తనను కౌన్సిలర్‌గా గుర్తించి అజెండా కాపీ పంపించాలని ఆమె కోరారు.


మహాలింగార్చన నిర్వహిస్తున్న దృశ్యం

ఆదిత్యాలయంలో మహా లింగార్చన

అరసవల్లి, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామివారి ఆలయ అనివెట్టి మండపంలో శివ పంచాయతన సహిత మహాలింగార్చన ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు ఇప్పిలి సాందీపవర్మ, దర్భముళ్ల శ్రీనివాసశర్మ, వికాస్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్యకు పరిష్కారమెప్పుడో?

● పొందూరు రైల్వేగేటు వద్ద నిత్యం అవస్థలే

● బ్రిడ్జి నిర్మించాలంటున్న వాహనచోదకులు

పొందూరు, మార్చి 26(ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలో రైల్వేగేట్ వద్ద ట్రాఫిక్ సమస్య పెద్ద సమస్యగా మారింది. నిత్యమూ వేలాది వాహనాలు, ప్రయాణికులు ఈ రైల్వే గేట్ మీదుగా ప్రయాణిస్తుంటారు. ఇక్కడ ఫ్లై ఓవర్, అండర్ రైల్వే బ్రిడ్జి లేకపోవడంతో గేట్‌లాక్ అయినప్పుడు ఇరువైపులా వందలాది వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. ఒక్కోసారి ట్రిపుల్‌లాక్ అయినప్పుడు గంటవరకు గేట్ తెరుచుకోకపోవడంతో ట్రాఫిక్ సమస్య పెరిగి ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. ఉదయం పూట ఉద్యోగులు, విద్యార్థులు వెళ్లే సమయంలో గేట్ పడిపోతే గంటల తరబడి వేచి ఉండడంతో కార్యాలయాలకు, విద్యా సంస్థలకు ఆలస్యంగా వెళ్లాల్సివస్తోందని ఉద్యోగులు, విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గేట్‌కు ఇరువైపులా వందలాది గ్రామాల నుంచి రోజూ వేలాది మంది రాకపోకలు సాగిస్తున్నారు. అధికారులు స్పందించి ఫ్లై ఓవర్ గాని, అండర్ వే బ్రిడ్జిగాని నిర్మించి సమస్య పరిష్కరించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


గేట్ పడితే నిత్యమూ ఇదే పరిస్థితి

తాగునీరు అందించాలి

ఇచ్ఛాపురం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురం మునిసిపాల్టీ ప్రజలు తాగునీటికి ఇబ్బందిపడుతున్నారని, వారి సమస్యను పరిష్కరించాలని ఒడిశా ఇరిగేషన్ అధికారులను సీడాప్ మాజీ చైర్మన్ సాడి శ్యాంప్రసాద్ రెడ్డి కోరారు ఈ మేరకు శనివారం ఒడిశా చీఫ్ ఇంజనీర్ మైనర్ ఇరిగేషన్ వాటర్ రిసోర్స్ డిపార్ట్‌మెంట్ అధికారి చిన్మాయ్ రంజన్ రౌట్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. బాహుదా నదిలో నీరులేనందున ప్రజలు తాగునీటికి ఇబ్బం దులు పడుతున్నారు. ఒడిశా బగలెట్టిడ్యాం గేట్లు ఎత్తివేసి నీరు బాహుదానదికి వచ్చే ఏర్పాట్లు చేయాలని కోరారు. అదేవిధంగా జిల్లా కలెక్టర్‌కు నీటి సమస్యను తెలియజేయడం జరిగిందని శ్యాంప్రసాద్‌రెడ్డి తెలిపారు.

అలరించిన నాటిక ప్రదర్శనలు

శ్రీకాకుళం కల్చరల్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): నగరంలోని బాపూజీ కళామందిర్‌లో శనివారం జరిగిన పౌరాణిక నాటిక ప్రదర్శనలు ఆలరించాయి. కురుక్షేత్రంలోని దుర్యోధునిడి మాయసభ ఘట్టం, రామాంజనేయ యుద్ధ సీను, గయోపాఖ్యానం యుద్ధసీనుతో పాటు సత్యహరిశ్చంద్రలోని వారణాసి సీను ఆకట్టుకున్నాయి. కురుక్షేత్రంలో శ్రీకృష్ణుడిగా ఎ.కోటేశ్వరరావు, రామాజంనేయ యుద్ధ సీనులో శ్రీరాముడిగా నర్సీపట్నం శ్రీనివాస్, ఆంజనేయుడిగా భూపాలం రమణ, గయోపాఖ్యానం యుద్ధసీనులో శ్రీకృష్ణుడిగా దూపం తిరుమల తేజ, అర్జునుడిగా దూపం రామకృష్ణ, సత్యహరిశ్చంద్ర నాటికలోని వార ణాసి సీనులో సత్యహరిశ్చంద్రుడిగా జి.రామబ్రహ్మారెడ్డి, నక్షత్రకుడిగా ఎం.వాసు దేవరావు తదితరులు ముఖ్యపాత్రలో నటించారు. సభ నిర్వాహకులు బీఏ మోహన్‌రావు మాట్లాడుతూ.. కళాకారులను ప్రోత్సహించేం దుకు ఏటా పౌరాణిక నాటికలు ప్రదర్శిస్తున్నా మన్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న దర్మపురి గౌరీశంకర్ శాస్త్రి మాట్లాడుతూ.. కళాకారులను ప్రోత్సహించడంతోపాటు వారికి ఏటా ఆర్థిక సాయం అందించ డం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా పద్మశ్రీ అవార్డు గ్రహీత యడ్ల గోపాలం, కళాకారులు గొట్టి ప్రభాకరరావు, జీవీ రమణ, సొర శ్రీనివాసరావు, గజల్ వాసుదేవాచారి, బలివాడ శ్రీనివాసరావు, కన్నేపల్లి సుబ్బారావులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహన్‌రావు, విజయనగరం మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య తదితరులు పాల్గొన్నారు.


కురుక్షేత్రం పౌరాణిక నాటికలోని ఓ సన్నివేశం

ఖమ్మం జిల్లాలో రోడ్డు ప్రమాదం

● చెన్నాపురం వాసి మృతి

నరసన్నపేట, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లాలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో చెన్నాపురం గ్రామానికి చెందిన గంగు సోమేశ్వరరావు (28) మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. ఆ వివరాలిలా ఉన్నాయి.. సూర్యాపేట జిల్లా కోదాడలో టైల్స్ పనులు చేస్తూ సోమేశ్వరరావు జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలంలో పనులు ముగించుకుని ద్విచక్ర వాహనంపై కోదాడ వస్తుండగా కోనాయి గూడెం సమీపంలో టిప్పర్ ఢీకొని అక్కడక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న భార్య శ్రావణి లబోదిబోమంటూ కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వెంటనే మృతదేహాన్ని చెన్నాపురం తీసుకువచ్చి శనివారం అంత్య క్రియలు నిర్వహించారు. కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

గుండెపోటుతో మహిళ మృతి

● ఆర్టీసీ బస్సులోనే ఘటన



బస్సులో ఉన్న తల్లి మృతదేహం వద్ద రోదిస్తున్న కుమారుడు కిరణ్

గుజరాతీపేట, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సులో వస్తుండగా ఓ మహిళ గుండె పోటుకు గురై మృతి చెందిన ఘటన శనివారం జిల్లా కేంద్రం సమీపంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే మందస మండలం కుంటికోట గ్రామా నికి చెందిన గుజ్జు తారమ్మ(50) అనారోగ్యంతో బాధపడుతుంది. ఈ క్రమంలో వైద్య పరీక్షల కోసం విశాఖ వెళ్లేందుకు తన కుమారుడు కిరణ్ కుమార్‌తో కలిసి శనివారం ఉదయం పలాస చేరుకుంది. అక్కడి నుంచి ఆర్టీసీ బస్సులో వస్తూ శ్రీకాకుళం సమీపానికి చేరుకునే సరికి గుండెపోటుకు గురైంది. శ్రీకాకుళం బస్ కాంప్లెక్స్ చేరుకొనేలోగా బస్సులోనే ప్రాణాలు విడిచింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

చికిత్స పొందుతూ ఆర్టీసీ కండక్టర్..



తిరుపతిరావు (ఫైల్)

ఆమదాలవలస, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన పురపాలక సంఘం పరిధి 20వ వార్డు వెంగళరావు కాలనీకి చెందిన ఆర్టీసీ కండక్టర్ తంజెళ్ల తిరుపతిరావు(62) చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్టు ఏఎస్ఐ సత్యనారాయణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. ఈనెల 15వ తేదీన తిరుపతిరావు తన ద్విచక్ర వాహనంపై మార్కెట్ నుంచి ఇంటికి వస్తుండగా ఆమదాలవలస ఫ్లై ఓవర్ వద్ద ముందు వెళ్తున్న ట్రాక్టర్ డ్రైవర్ సడన్‌గా బ్రేక్ వేయడంతో తిరుపతిరావు బలంగా ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే చికిత్స నిమిత్తం రాగోలు సమీపంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందారు. తిరుపతిరావుకు భార్య కాంతమ్మ, కుమారుడు ఉన్నారు.

రైలు కిందపడి గుర్తుతెలియని వృద్ధుడు..

ఇచ్ఛాపురం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వే స్టేషన్ పరిధి సుర్లారోడ్డు-ఇచ్ఛాపురం ఆర్ఎస్ మధ్య శనివారం రైలు కిందపడి గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందినట్టు పలాస జీఆర్‌పీ పోలీసులు తెలిపారు. సుమారు 60 ఏళ్ల వయసు ఉంటుందని, పసుపు రంగు లాల్చీ, నీలం రంగు పూలు కలిగిన లుంగీ ధరించి ఉన్నట్టు తెలిపారు. మృతుడి వివరాలు తెలిసినవారు 8985021143 నెంబరులో సంప్రదించాలని కోరారు.

ఉపాధి పనులు చేస్తూ వేతనదారుడు..



గన్నెరాజు(ఫైల్)

నరుబుజ్జిలి, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): ఇసకలపాలెం గ్రామానికి చెందిన గుజ్జల గన్నెరాజు (67) శనివారం ఉపాధి పనులు చేస్తున్న చోటే మృతి చెందాడు. వేతనదారులతో కలిసి కాలువలో మొక్కలు తొలగిస్తుండగా సొమ్మ సిల్లి ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. తోటి వేతనదారులు సపర్యలు చేసిన ఫలితం లేకపోయింది. టెక్నికల్ అసిస్టెంట్ లలితమ్మ, ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీరాములు ఇచ్చిన సమాచారం మేరకు ఏపీవో పార్వతి ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి, ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. కాగా గన్నెరాజుకి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

19 మద్యం బాటిళ్ల స్వాధీనం

పోలాకి, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): జిల్లేడువలస కూడలి వద్ద శనివారం పోలాకి ఎస్ఐ రంజిత్ పర్యవేక్షణలో సిబ్బంది ఓ దాబాపై దాడి చేశారు. ఈ సందర్భంగా యజమాని సాహును అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి 19 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. అక్రమంగా మద్యం తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కానిస్టేబుళ్లు శంకరరావు, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

పశువుల అక్రమ రవాణాపై కేసు నమోదు

నందిగాం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి) ఇచ్ఛాపురం నుంచి పశువులను అక్రమంగా తరలిస్తున్న వారిపై కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ జీవీ రమణ తెలిపారు. శనివారం సాయంత్రం జాతీయ రహదారిపై తనిఖీ చేస్తుండగా వాకాడ శేఖర్‌కు చెందిన లగేజీ వాహనంలో మూడు ఆవులు, మూడు దూడలను చింతాడ సంతకు తరలిస్తుండడంతో పట్టుకున్నా మన్నారు. పశువులను గోశాలకు అప్పగించనున్నట్లు తెలిపారు.

వ్యక్తికి తీవ్ర గాయాలు

నరసన్నపేట, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): మడపాం వంశధార వంతెన వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇచ్ఛాపురానికి చెందిన కొసరాజు అనే వ్యక్తి తీవ్రంగా గాయపడినట్లు నేషనల్ హైవే సిబ్బంది తెలిపారు. శ్రీకాకుళం నుంచి ఇచ్ఛాపురం ద్విచక్రవాహనంపై వెళుతుండగా బైక్ అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కొసరాజు తలపై తీవ్ర గాయాలు కావడంతో శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రికి తరలించినట్లు హైవే అంబులెన్స్ సిబ్బంది తెలిపారు.

కాశీబుగ్గలో 'చిన్న తిరుపతి'

● నేటి నుంచి వెంకన్న ఆలయ ప్రారంభోత్సవాలు
● మూడు రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు

కాశీబుగ్గ, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): కలియుగ ప్రత్యక్ష దైవం వెంకన్న స్వామి దర్శన భాగ్యం జంట పట్టణాలతో పాటు పరిసర గ్రామాల ప్రజలకు కల్పించాలన్న ఉద్దేశంతో రూపొందించిన ఆలయం ప్రారంభానికి సిద్ధమైంది. కాశీబుగ్గ బ్రాహ్మణ వీధికి చెందిన హరి ముకుంద పండా ఆలోచనలతో నిర్మించిన వేంకటేశ్వరాలయాన్ని ఆదివారం ప్రారంభించి మూడురోజుల పాటు ప్రతిష్ఠోత్సవాలు నిర్వహించనున్నారు. పూర్వీకుల నుంచి వచ్చిన పొలాల్లో పండిన పల సాయంతో ఈ ఆలయం నిర్మించారు హరిముకుంద పండా. తాత, ముత్తాతల నుంచి పట్టణ నడిబొడ్డున దఖలు పడిన సుమారు 100 ఎకరాల భూమిని నేటికీ ఆయన కుటుంబీకులే సాగు చేసుకుంటున్నారు. దీనితో వచ్చిన ఆదాయంతో ఆలయ నిర్మాణం పూర్తి చేశారు. ఈ నిర్మా ణానికి బలమైన కారణం ఉండడం, ఎంతో పట్టుదలతో, భక్తిశ్రద్ధలతో ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఆలయ నిర్మాణానికి దాతలు లేకపోవడం కొసమెరుపు. ఈ ఆలయంలో ప్రతిష్ఠించనున్న శ్రీవారు, పద్మావతి సహిత అమ్మవారి విగ్రహాలు ఏకశిలతో ఉండి తిరుమలలోని విగ్రహాలను పోలి ఉన్నాయి.



ప్రారంభానికి సిద్ధమైన వెంకన్న ఆలయం

తల్లి ఆదేశాలతో..

ఒకసారి పండా తిరుమల స్వామి దర్శనానికి వెళ్లారు. అయితే అక్కడి సిబ్బంది, నిబంధనల కారణంగా దర్శనభాగ్యం కలుగలేదు. సిబ్బంది అతడిని తోసివేయడంతో అవమానాన్ని గురై తల్లి హరి విష్ణుప్రియ పండాకు తెలిపారు. దీనికి ఆమె బదులిస్తూ.. మనమే ఎందుకు ఆలయం నిర్మించకూడదు అని ప్రశ్నించి వెంటనే ఆ పనులు చేపట్టాలని సూచించింది. ఆమె ఆదేశాలతో నిర్మాణం ప్రారంభించి ఐదేళ్ల పాటు మహాయజ్ఞంలా పనులు చేయించారు. ఆలయ నిర్మాణానికి ఎంత ఖర్చయిందని ఆయనను ప్రశ్నిస్తే.. చిరునవ్వుతో ఖర్చు, లెక్కల వివరాలేవీ తెలియవని.. మాతృమూర్తి హరివిష్ణుప్రియా పండాయే చూసుకుంటారని ఆయన చెప్పడం విశేషం.

ఏయే నిర్మాణాలు చేపట్టారంటే..

ఈ ఆలయంలో సకల దేవతా విగ్రహాలను కొలువుదీర్చారు. పేదల కోసం కల్యాణ మండపం, స్వామి వారి దర్శనానికి వచ్చే భక్తులు స్నానమాచరించేందుకు కోనేరు ఏర్పాటు చేశారు. ఆలయం బయట భారీ ఆంజనేయ, గరుడ విగ్రహాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. ఇక్కడి స్వామిని దర్శించుకుంటే తిరుమల సందర్శించినట్లు ఫీలింగ్ ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

అందరూ దర్శనం చేసుకునేలా..



తిరుపతి వెళ్లి భక్తులు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు అందరికీ అందుబాటులో ఉండేలా టీటీడీని పోలినట్లుగా ఆలయ నిర్మాణం చేపట్టాం. అందరూ వచ్చి దర్శనం చేసుకుని ఆధ్యాత్మిక అనుభూతిని పొందాలన్నదే మా ధ్యేయం. శ్రీవారితో పాటు దేవతా మూర్తులు, అమ్మవార్లు, శివ పార్వతులు ఇలా అందరు దేవతల విగ్రహాలు ఏర్పాటు చేశాం. నిత్యాన్న దానం చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం.

-హరిముకుంద పండా, ధర్మకర్త

నేటినుంచి ప్రతిష్ఠోత్సవాలు

ఆదివారం నుంచి 30వ తేదీ వరకు ఆలయ ప్రారంభం, విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ధర్మకర్తలు హరిముకుందా పండా, కుమారుడు డాక్టర్ హరిరాజ్‌కుమార్ పండా, కోడలు హరి గాయత్రి పండా తెలిపారు. వేద పండితులు నగరంపల్లి విశ్వనాథ శర్మ, అంపోలు రామప్రసాద్ శర్మ పర్యవేక్షణలో రుత్వికులతో వివిధ కార్యక్రమాలు చేపడుతున్నామని, భక్తులు పాల్గొని స్వామిని దర్శించుకుని ఆయన కృపకు పాత్రులు కావాలని కోరారు.

ఉపాధి పనులను పరిశీలించిన కేంద్ర బృందం



మెళియాపుట్టి: ఉపాధి పనులను పరిశీలిస్తున్న కేంద్ర బృందం సభ్యులు

మెళియాపుట్టి/పాతపట్నం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): మెళియాపుట్టి, పాతపట్నం మండలాల్లో చేపట్టిన ఉపాధి హామీ పనులను ఢిల్లీ నుంచి వచ్చిన ప్రత్యేక బృందం శనివారం పరిశీలించింది. బృంద సభ్యులు కిరణ్‌పాడి, భరత్‌సింగ్ రోడ్లు, ఉపాధి పనులను పరిశీ లించారు. మెళియాపుట్టి మండలం ఎంసీపీ కొత్తూరు, అడ్డివాడ గ్రామాల్లో రోడ్లను పరిశీలించారు. స్థానిక గిరిజనులతో మాట్లాడారు. ఉపాధి నిధులతో కొండపై గ్రామానికి వేసిన రోడ్డు వల్ల డోలీ బాధలు తప్పాయని అడ్డివాడ గ్రామస్థులు వారి దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా బృంద ప్రతినిధులు మాట్లా డుతూ.. మీకు ఏమి అవసరమో తెలిపితే కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి నిధులు మంజూరు చేయిస్తామన్నారు. ఆదాయం వచ్చే మొక్కలు ఇవ్వాలని, తాగునీటి సమస్యలను పరిష్కరించాలని స్థానికులు పేర్కొనగా ఉపాధి నిధులు నుంచి బావులు తవ్వేందుకుఅనుమతులివ్వడం జరుగుతుందన్నారు. పాతపట్నం మండలం బడ్డుమర్రి, ఏఎస్ కవిటి పంచాయతీల్లో చేపడుతున్న బీటీ రోడ్డు పనులను పరిశీలించారు. పనులను నాణ్యతతో చేపట్టాలని సూచించారు. దీర్ఘకాలిక ప్రయోజనాలు చేకూర్చే పనులపై ప్రత్యేక దృష్టి సారించి నిరంతర పరిశీలన చేయాలని ఐటీడీఏ ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. కార్యక్రమాల్లో ఏపీడీలు రాధ, శైలజ, ఐటీడీఏ ఈఈ రమాదేవి, డీఈ సిమ్మన్న, ఎంపీడీవోలు ప్రసాద్‌పండా, పి.చంద్రకుమారి, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాన్ని తొలగించాల్సిందే..

● మూడో రోజూ కొనసాగిన నిరసన

పాతపట్నం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): హౌసింగ్ బోర్డు కాలనీ సమీపంలో ఏర్పాటు చేసిన మద్యం దుకాణాన్ని తొలగించాలని స్థానిక మహిళలు చేపట్టిన నిరసన శనివారం మూడోరోజూ కొనసాగింది. మహిళలు మద్యం దుకాణంలో ప్రవేశించి బైఠాయించారు. మద్యం అమ్మకాలు నిలిపి వేయా లని, ఇక్కడి నుంచి తక్షణం దుకాణాన్ని తరలిం చాలని నినాదాలు చేశారు. దీంతో దుకాణ నిర్వాహకులు ఎక్సైజ్ అధికారులకు సమాచారం ఇవ్వగా అధికారులు మహిళలతో ఫోన్‌లో మాట్లాడారు. ఎస్ఐ, సిబ్బందిని పంపుతున్నామని పేర్కొ న్నారు. ఎస్ఐ అక్కడికి చేరుకుని మహిళ లతో చర్చించారు. మద్యం విక్రయం నిలిపి వేయాలని, అంత వరకు ఈ ఉద్యమం ఆగదని వారు స్పష్టం చేశారు.



ఎక్సైజ్ అధికారులతో మాట్లాడుతున్న మహిళలు

రీ సర్వేలో తప్పిదాలు లేకుండా చూడండి

కొత్తూరు, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): గతంలో నిర్వహించిన రీ సర్వేలో అనేక తప్పిదాలు జరిగాయని, దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని, ప్రస్తుతం మరలా చేపడుతున్న సర్వేలో తప్పిదాలు లేకుండా చర్యలు తీసుకోవాలని వైస్ ఎంపీపీ ఎల్.తులసీవర ప్రసాదరావు అన్నారు. ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం ఎంపీపీ సవర సావిత్రి అధ్యక్షతన మండల సమావేశం నిర్వహించారు. రీ సర్వే సమస్యను వైస్ ఎంపీపీ ప్రస్తావించగా ఇన్‌చార్జి తహసీ ల్దార్ శంకరరావు మాట్లా డుతూ.. సమస్యలు ఉత్ప న్నం కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. సభ్యులు కాని వారు సభలో వివిధ అంశాలపై అధికారులను ప్రశ్నిస్తున్నప్పటికీ వీరిని నియంత్రించేందుకు ఎంపీడీవో వి.నీరజ స్పందించక పోవడంపై చర్చనీయాంశమైంది. అటు సీఎం పర్యటన, ఇటు ఎండల తీవ్రత ఎక్కువగా ఉండడంతో సమావేశాన్ని నామ మాత్రంగా నిర్వహించారు. సమావేశంలో ఈవోపీ ఆర్డీ వసంతకుమారి, ఐసీడీఎస్ సీడీపీవో యు.విమలకుమారి తదితరులు పాల్గొన్నారు.

దీర్ఘాశిలో గంధం అమావాస్య పూజలు



బారులుదీరిన భక్తులు

పోలాకి, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): దీర్ఘాశిలో సింహాద్రి అప్పన్న భక్తులు గంధం అమావాస్య పూజలను శనివారం నిర్వహించారు. దూర ప్రాం తాల నుంచి వచ్చిన భక్తులు కంచర వీధిలోని పాలిన పెద్దోడు, లక్ష్మి ఇంటిలో కొలువైన స్వామిని దర్శించుకుని, మొక్కులు చెల్లించి ఆ దంపతులను కలుసుకుని వారి ఆశీస్సులు తీసుకోవడం ఆనవాయితీ. ఈ నేపథ్యంలో వందలాది భక్తు తరలి రావడంతో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు నిర్వాహకులు భోజన, వసతి సదుపాయాలు కల్పించారు. భక్తులు అరటి గెలలు, కొబ్బరి కాయలు తీసుకువచ్చి స్వామికి ప్రత్యేక పూజలు చేశారు.

అతిథి గృహంలో ఒడిశా గవర్నర్ విశ్రాంతి

● స్వాగతం పలికిన అధికారులు



గవర్నర్ హరిబాబుకు స్వాగతం పలుకుతున్న రెవెన్యూ అధికారులు

పలాసరూరల్,ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): ఒడిశా గవర్నర్ కంభంపాటి హరిబాబు భువనేశ్వర్ నుంచి విశాఖపట్నం వెళుతూ శనివారం పలాస మండలం రామకృష్ణాపురం పవర్ గ్రిడ్ అతిథి గృహంలో కొంతసేపు సేదతీరారు. ఆయనకు తహసీల్దార్ కల్యాణ చక్రవర్తి, పోలీసు ఉన్నతాధికారులు, ఆర్ఐ ఖగేశ్వరనాయుడు, సిబ్బంది మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు. పోలీసులు ఆయనకు గార్డ్ ఆఫ్ ఆనర్‌తో స్వాగతం పలికారు. సుమారు అరగంట పాటు విశ్రాంతి అనంతరం విశాఖపట్నం బయలుదేరారు. ఆయనతో పాటు ఒడిశా రాష్ట్ర ఐఏఎస్, ఐపీఎస్ అధికారులున్నారు.

ఆధునిక విధానాలను పాటించాలి



మాట్లాడుతున్న డీడీ డా.జయరాజ్

పాతపట్నం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): పశు వైద్య రంగంలో వస్తున్న ఆధునిక విధానాలను పాటించాలని పశు సంవర్ధక శాఖ టెక్కలి డివిజన్ డీడీ డా.వి.జయరాజ్ అన్నారు. స్థానిక ప్రాంతీయ పశు వైద్యశాలలో శనివారం ప్రపంచ పశువైద్య దినోత్సవాన్ని నిర్వహించారు. పశువైద్య రంగం సేవలను క్షేత్రస్థాయికి తీసుకువెళ్లాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో ఏడీలు మంచు కరుణాకరరావు, డా.లోకనాథం, ఎంపీటీసీ కొండాల యరకయ్య, పశువైద్యాధికారులు పి.అనిల్, మౌనిక, ఈవోపీఆర్డీ వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

భారీ వాహనాలతో ట్రాఫిక్‌కు అంతరాయం



ఎల్.ఎన్.పేట, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): అలికాం-బత్తిలి ప్రధాన రోడ్డుపై భారీ వాహనాలు రాక పోకలు జరుగుతుండడంతో నిత్యం వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొం టున్నారు. ప్రధాన రోడ్డుకు అనుసరించి ఉన్న ప్రధాన కూడళ్ల వద్ద బస్సులు, ఆటోలు నిలిచిపోయి ఇతర వాహనాలు వెళ్లేందుకు వీలులేకుండా పోతోంది. గంటల తరబడి ఇదే పరిస్థితి ఉండ డంతో ప్రయాణికులు ఇక్కట్లకు గురవుతున్నారు. అత్యవసర సమయాల్లో దూరప్రాంతాలకు, పట్టణాలకు వెళ్లాలంటే రెండు నుంచి మూడుగంటల సమయం పడుతోందని వాహనదారులు పేర్కొంటున్నారు. తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి చేసుకోవాలి

మెళియాపుట్టి, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): రాజకీయాలకు అతీతంగా పంచాయతీలను అభివృద్ధి చేసుకోవాలని డీఎల్పీవో ఆర్.గోపీబాల అన్నారు. కొసమాళ సర్పంచ్ పంచాయతీలో ఎటువంటి పనులు చేయడం లేదని కూటమి నేతలు ఇటీవల కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో ఆయన ఆదేశాలతో శనివారం డీఎల్పీవో విచారణ చేపట్టారు. గ్రామంలో పనులు నిర్వహించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని కూటమి నాయకులు ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. పనులు జరగ కుండా అడ్డుపడుతున్నారని సర్పంచ్ తదితరులు పేర్కొనడంతో ఇరువర్గాల బాహాబాహీకి దిగాయి. ఈ నేపథ్యంలో పోలీసులు రంగప్రవేశం చేసి వివాదాన్ని సద్దు మణిగించారు. ప్రజలకు ఇబ్బంది లేకుం డా తాగునీరందించాలని, కాలువల్లో పూడికలు తీయించాలని డీఎల్పీవో సూచించారు. చాపర గ్రామంలో పనులను పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ రవి కుమార్, కూటమి నాయకులు బి.ప్రసాదరావు, వెంకట్రావ్, శ్రీను, వనజాక్షి, హేమంత్‌కుమార్ పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

జాతీయ లోక్ అదాలత్ వాయిదా

టెక్కలి/కోటబొమ్మాళి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): టెక్కలి, కోటబొమ్మాళి కోర్టుల్లో మే 10వ తేదీన జరగాల్సిన జాతీయ లోక్‌అదాలత్ వాయిదా పడినట్లు సీనియర్, జూనియర్ సివిల్ న్యాయాధికారులు బి.నిర్మల, బీఎంఆర్ ప్రసన్నలత శనివారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. జూలై 5న ఈ లోక్‌అదాలత్ నిర్వహించనున్నామని, కక్షిదారులు, పోలీసులు, న్యాయవాదులు గమనించాలని కోరారు. అధిక సంఖ్యలో రాజీపడదగ్గ కేసులను గుర్తించి తీసుకురావాలని సూచించారు.

విజ్ఞానంపై శిక్షణ

టెక్కలి, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): వేసవిలో విద్యార్థులకు విజ్ఞానం, వినోదం, ఉత్తమ వ్యక్తిత్వం అలవరిచేందుకు గాను శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తుననట్లు ప్రజా చైతన్య కళాసమితి అధ్యక్షుడు యు.గణపతిరావు, ప్రధానకార్యదర్శి చిలుకు కృష్ణారావు తెలిపారు. శిక్షణ శిబిరాన్ని శనివారం ప్రారం భించారు. మే 16వ తేదీ వరకు నిర్వహించనున్నామన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్విని యోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బొడ్డ అయ్యబాబు, గణపతిరావు, డీపీ స్టాలిన్, మూల తాతయ్య, అనిశెట్టి చిట్టిన్న తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బ తగలకుండా అప్రమత్తంగా ఉండాలి

నరసన్నపేట, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): ఉపాధి పనులు చేసే సమయంలో వడదెబ్బకు గురికాకుండా అప్రమత్తంగా ఉండాలని ఉర్లాం పీహెచ్‌సీ విస్తరణాధికారి టి.గణపతిరావు సూచించారు. శనివారం కొల్లవానిపేటలో ఉపాధి వేతనదారులకు అవగాహన కలిగించారు. పని ప్రదేశానికి తాగునీరు, మజ్జిగ తీసుకువెళ్లాలన్నారు. అలసట కలిగితే చెట్టు నీడలో ఉండాలన్నారు. కార్యక్రమంలో జి.వెంకటరమణ, డి.కూర్మారావు, బి.సుజాత తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో గుణాత్మక విద్య

జలుమూరు, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో క్రమశిక్షణతో కూడిన గుణాత్మకమైన విద్య అందిస్తున్నామని స్థానిక ఉన్నత పాఠశాల హెచ్ఎం మెండ రాజారావు అన్నారు. శనివారం జలుమూరులో ఇంటింటికీ వెళ్లి బడిఈడు పిల్లలను గుర్తించి ప్రభుత్వ పాఠశాలలకు పంపాలని తల్లిదండ్రులకు సూచించారు. శిక్షణ పొందిన ఉపాధ్యాయులతో విద్యాబోధన సాగుతోందని, ఉచితంగా పాఠ్యపుస్తకాలు, యూనిఫారాలు, మధ్యాహ్న భోజనం అందిస్తున్నందున ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మండల పరిషత్ ఏవోగా పార్వతీశం

నందిగాం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ పరిపాలనాధికారి (ఏవో)గా బి.పార్వతీశం శనివారం బాధ్యతలు చేపట్టారు. ఈయన కోట బొమ్మాళిలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేసి పదోన్నతిపై ఇక్కడి నియమితులయ్యారు. ఇక్కడ పనిచేసిన ధనలక్ష్మి పదవీ విరమణ చేయడంతో ఆమె స్థానంలో పార్వతీశం బాధ్యతలు స్వీకరించారు. ఆయనను సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు.

భక్తిశ్రద్ధలతో శని త్రయోదశి పూజలు

పోలాకి, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): శని త్రయోదశి పర్వదినం సందర్భంగా శనివారం పలు ఆలయాల్లో భక్తులు తైలాభిషేకాలు చేశారు. దీర్ఘాశి, సంతలక్ష్మీపురం, పిన్నింటిపేట, ఈదులవలస, మబగాం, ప్రియాగ్రహారం శనీశ్వరాలయాలకు తెల్లవారుజాము నుంచే భక్తులు తరలి వెళ్లారు. నవధాన్యాలతో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొన్నారు.

పశువుల దాహార్తి తీర్చేందుకు..

● ఉపాధి నిధులతో నీటి తొట్టెల నిర్మాణం
● వచ్చేనెల ఒకటి నాటికి ప్రారంభించనున్న అధికారులు



తామరాపల్లిలో నిర్మించిన నీటి తొట్టె

నరసన్నపేట/పలాస రూరల్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): ఎండల తీవ్రత రోజు రోజుకూ పెరుగుతోంది. ఎండ ధాటికి ఇటు ప్రజలతో పాటు అటు పశువులు అల్లాడుతున్నాయి. పైగా దాహార్తితో అలమటిస్తున్నాయి. ఈ నేపథ్యంలో గ్రామాల్లో పశువులకు నీటి ఇబ్బంది లేకుండా చేసేందుకు ప్రభుత్వం నీటి తొట్టెలను ఏర్పాటు చేస్తోంది. ఒక్కోటి రూ.35 వేల ఉపాధి నిధులతో జిల్లాలో 1560 తొట్టెల నిర్మాణం చేపడుతున్నారు. ఎక్కువగా పశువులు సంచరించే ప్రాంతాలు, పాల సేకరణ కేంద్రాలు, నీటి సదుపాయం ఉన్న చోట వీటిని నిర్మిస్తున్నారు. మే ఒకటో తేదీ నాటికి పనులు పూర్తి చేసి ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పశు సంవర్ధక శాఖ జేడీ రాజగోపాలరావు తెలిపారు. ఆ తరువాత నీటి తొట్టెల నిర్వహణను సంబంధిత పంచాయతీ కార్యదర్శులు చూడాల్సి ఉంటుందన్నారు.



తర్లాకోటలో..